ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

గ్యాస్ సబ్సిడీ ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

• ఎమ్మెల్యే విజయుడు

ఉండవెల్లి, సెప్టెంబర్ 25 : ప్రభుత్వ పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగించుకోవాలని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు పేర్కొన్నారు. మండలంలోని పుల్లూరు గ్రామంలోని గ్యాస్ సబ్సిడీ ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు ఎమ్మెల్యే బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్యాస్ సబ్సిడీ ధ్రువీకరణ పత్రాలు రానివారు ఉంటే ఎంపీడీవో కార్యాలయం అధికారులకు సమస్యను వివరించి సబ్సిడీ ధ్రువీకరణ పత్రాలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీసీఎస్ చైర్మన్ గజేందర్‌రెడ్డి, రాఘురెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులకు భయపడేది లేదు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

• బీఆర్ఎస్ నాయకులు

వనపర్తి టౌన్, సెప్టెంబర్ 25 : ప్రశ్నించే గొంతుకలను అరెస్టులు చేసి వేధించినా భయపడేది లేదని బీఆర్ఎస్ సోషల్ మీడియా అధ్యక్షుడు మాధవరావు, సునీల్, హేమంత్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారని, మంగళవారం ఉదయం బీఆర్ఎస్ యూత్ శ్రేణులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి సాయంత్రం వరకు వేధించారని, కనీసం ఫిటిషన్లు కూడా ఇవ్వకున్నా వేధింపుల పర్వం చేపడుతున్నారన్నారు. పోలీసులపై ఒత్తిడి తెచ్చి పాలన చేస్తున్నారని వారు ఆరోపించారు. ఇటీవల చెరువులు నిండినప్పుడు ఎమ్మెల్యే వాటిని పరిశీలించి గోపాలసముద్రం వద్ద మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అబద్ధపు ఆరోపణలు చేయడంతో వాటిని ఖండించి వాస్తవాలు రాస్తే పోలీసులతో నిర్బంధం చేసి దుర్భాషలాడారని వారు చెప్పారు. ఎవరూ ఫిర్యాదు ఇచ్చారని ఎస్సైని అడుగగా మాట్లాడకి అవకాశం లేకుండా ఇష్టానుసారంగా నిర్బంధించి నోరు పారేసుకోవడం సిగ్గుచేటన్నారు. పోలీస్ వ్యవస్థ పూర్తిగా వైఫల్యం చెందిందని ఇది చక్కని ఉదాహరణ అని అన్నారు. తెలంగాణ పోలీస్ అంటే ఎనలేని గౌరవం ఉందని ఒత్తిడుల వల్ల ఇతరులపై వేధింపులు ఆపాలని, ఇప్పటికైనా ప్రజాస్వామ్యబద్ధంగా నడుచుకోవాలన్నారు. ఆకాశరామన్న ఫిటిషన్లతో కేసులు నమోదు చేస్తూ నిర్బంధించడం ఎంతవరకు సమంజసమని వారన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ యువజన అధ్యక్షుడు గిరి, జోహెబ్ హుస్సేన్, మోహన్‌యాదవ్, నవీన్‌కుమార్, సలీం, రాము, రామస్వామి తదితరులు ఉన్నారు.

అక్రమ అరెస్టులు అమానుషం

గట్టు, సెప్టెంబర్ 25 : బీఆర్ఎస్ నాయకుల అరెస్టులు అమానుషమని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ సింగిల్ విండో చైర్మన్ అంగడి బస్వరాజు అన్నారు. ప్రాజెక్ట్‌లు, రిజర్వాయర్లకు మంత్రులు వచ్చిన నేపథ్యంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులను పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా అంగడి బస్వరాజు మాట్లాడుతూ ఏడాది కావస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న అభివృద్ధి ఏమీలేదన్నారు. గట్టులో అదనపు రిజర్వాయర్ నిర్మిస్తామని చెబుతుండడం ఒట్టి బూట కమన్నారు. కర్ణాటకకు మేలు చేయడానికే ఈ రిజర్వాయర్ ఉపయోగపడుతుందని బస్వరాజు విమర్శించారు.

ప్రతిభను వెలికితీసేందుకు పోలీస్ డ్యూటీ మీట్

• అదనపు ఎస్పీ రామదాస్ తేజావత్

పోలీసు అధికారులు, సిబ్బందితో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ రామదాస్ తేజావత్

వనపర్తి టౌన్, సెప్టెంబర్ 25: పోలీసు అధికారుల, సిబ్బంది ప్రతిభను వెలికి తీసేందుకు జిల్లాస్థాయి పోలీస్ డ్యూటీ మీట్ అని అదనపు ఎస్పీ రామదాస్ తేజావత్ అన్నారు. రాష్ట్రంలో జరుగనున్న మొదటి పోలీస్ డ్యూటీ మీట్ సందర్భంగా జిల్లాస్థాయిలో అధికారులు, సిబ్బందిలో ప్రతిభను వెలికి తీసేందుకు బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎంపిక నిర్వహించినట్లు తెలిపారు. బాంబు స్క్వాడ్, నార్కోటిక్, ట్రాకర్ జాగిలాలను ఉపయోగించి ఏ విధంగా గుర్తించాలి అన్న అంశాలపై పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. అదేవిధంగా సిబ్బందికి కంప్యూటర్‌పై ఎంతవరకు అవగాహన ఉన్నదనే అంశాలపై కమ్యూనికేషన్ స్కిల్స్, సైబర్ క్రైమ్స్, నేరస్తుల ఫొటోగ్రఫీ, వీడియో గ్రఫీకు సంబంధించి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో ప్రతిభ కనబర్చిన వారిని జోనల్ లెవల్‌లో పోటీలకు పంపిస్తామని, అక్కడ ప్రతిభ కనబరిస్తే అక్టోబర్ 14 నుంచి 18 తేదీ వరకు జరిగే మొదటి రాష్ట్ర పోలీస్ డ్యూటీ మీట్‌కు పంపిస్తామన్నారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి మెడల్స్ తోపాటు నగదు బహుమతి, జీతంలో డబుల్ ఇంక్రిమెంట్లు ఇస్తామని తెలిపారు. జిల్లా ఏఆర్ అడిషనల్ ఎస్పీ వీరారెడ్డి ఇన్‌చార్జిగా వ్యవహరించారు. కార్యక్రమంలో డీఎస్పీ జయ వెంకటేశ్వరరావు, డీసీఆర్‌బీ డీఎస్పీ కృష్ణ కిశోర్, సీఐలు నాగ భూషణం, రాంబాబు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసులు, అప్పలనాయుడు, ఎస్సైలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చీడల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

• వ్యవసాయ శాస్త్రవేత్తలు

అయిజ, సెప్టెంబర్ 25 : వానకాలంలో సాగు చేసిన పంటల్లో చీడ పీడల నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కేవీకే,తపాలెంకు చెందిన శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. బుధవారం అయిజ పట్టణ పరిధిలో వేరుశనగ, పత్తి, కంది పంటలను శాస్త్రవేత్తలు శంకర్, సైదయ్య, ఈశ్వర్‌రెడ్డి, నళిని పరిశీలించారు. పత్తిలో రసం పీల్చే పురుగులను గమనించినట్లు తెలిపారు. నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 60 మి.లీ. లూదా డైపెన్ థయూరాన్ 250 గ్రా. ఎకరాకు 200 లీటర్ల నీళ్లతో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. వేరుశనగలో పొగాకు లద్దె పురుగు గమనించినట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. ఇమామెక్టిన్ బెంజోయేట 80 గ్రా. ఎకరాకు పిచికారీ చేయాలన్నారు. కందిలో ఆకుముడత నివారణ చర్యలు చేప ట్టాలన్నారు. క్లోరిపైరిపాస్ 500 మి.లీ ఎకరానికి 200లీటర్ల నీటిలో పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏవో జనార్దన్, ఏఈవో యువరాజు, రైతులు పాల్గొన్నారు.

గద్వాల మండలంలో..

గద్వాల రూరల్, సెప్టెంబర్ 25 : ఇటీవల కురిసిన వర్షాలకు పంటలకు తెగుళ్లు సోకి రైతులు తీవ్రంగా నష్టపో తూన్నారని, దీనిని నివారించడానికి వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు, సలహాలను పాటించాలని జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి సక్రియా నాయక్ రైతులకు సూచించారు. మండలంలోని గోనుపాడు గ్రామంలోని పంట పొలాలను శాస్త్రవేత్తలతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. అధిక వర్షాలకు దెబ్బతిన్న పంటలను శాస్త్రవేత్తలు పరిశీలించి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏడీఏ సంగీతలక్ష్మి, ఏవో ప్రతాప్ కుమార్, ఏఈవో హిందూజ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అయిజ శివారులో కంది పంటను పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

పంటల పరిశీలన

ధరూరు, సెప్టెంబర్ 25 : పంటలను తెగుళ్ల నుంచి కాపాడుకోవడానికి రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించాలని కేవీకే, పాలెం శాస్త్రవేత్తలు సూచించారు. మండలంలో పత్తి , వేరుశనగ పంటలను క్షేత్రస్థాయిలో పర్యటించి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు పత్తిలో రసం పీల్చే పురుగులు, వేరు శుగలో పొగాకు లద్దె పురుగు, కందిలో ఆకుముడుత గుర్తించారు. వీటి నివారణకు వ్యవసాయ శాఖ అధికారులు సూచించిన క్రిమిసంహారక మందులను పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు శంకర్, సైదయ్య, ఈశ్వర్, నళిని, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో తెగుళ్లు దూరం

గట్టు, సెప్టెంబర్ 25 : సస్యరక్షణ చర్యలతో పంటల్లో తెగుళ్లు దూరం చేసుకోవచ్చని పాలెం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు శంకర్, సైదయ్య, మల్లా రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఆలూరు శివారులోని పత్తి, ఆముదం పైర్లను వారు ఏవో హన్మంత్‌రెడ్డితో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రెండు పంటల్లోని తెగుళ్లను గుర్తించి నివారణ చర్యలను వారు రైతులకు వివరించారు. రైతులు వ్యవసాయాధికారులను సంప్రదిస్తూ పంటల సాగులో మెళకువలను తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో ప్రకాశ్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలి

సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్

• కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి టౌన్, సెప్టెంబర్ 25 : జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మరో నెలరోజులపాటు పక్కాచర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారులను కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం రాత్రి కలెక్టరేట్‌లో వైద్యాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా మల్టీ పర్పస్ వర్కర్లకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వ్యక్తిగత బుక్‌లెట్‌ను ఇవ్వాలని, 30 ఏండ్లు పైబడిన ప్రతి ఒక్కరికీ డయాబెటిస్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. రానున్న పది రోజుల్లో వర్షాలు అధికంగా కురిసే అవకాశం ఉందని, డెంగీ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారులను ఆదేశించారు. నెల రోజుల పాటు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి మంగళ, శుక్ర వారాల్లో డ్రై డే నిర్వహించాలని, క్రమం తప్పకుండా ఫాగింగ్ చేయాలని ఆదేశించారు. ఆశ వర్కర్లు డయాబెటిస్ పరీక్షలపై శిక్షణ ఇవ్వాలని, అక్టోబర్ 2వ తేదీ నుంచి జిల్లాలో మూడు గ్రామాలను పైలట్ ప్రాజెక్టుగా డయాబెటీస్ పరీక్షలు ప్రారంభించేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమీక్షా సమావేశంలో డీఎంహెచ్‌వో జయచంద్రమోహన్, కళాశాల ప్రిన్సిపాల్ సునందిని, సహాయ వైద్యాధికారి సాయినా రెడ్డి, ఇతర మెడికల్ సిబ్బంది ఉన్నారు.

పోస్టర్ విడుదల

వనపర్తి టౌన్, సెప్టెంబర్ 25 : జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ ఆధ్వర్యంలో వయోవృద్ధుల దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అక్టోబర్ 1న అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం నిర్వహిస్తున్నామని, అందుకు సంబంధించిన బుక్‌లెట్, పోస్టర్‌ను ఆవిష్కరించినట్లు తెలిపారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 1వ తేదీ వరకు వారంరోజులపాటు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తారని , 26న వృద్ధాశ్రమంలో వృద్ధులకు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు , 27న ర్యాలీ, 28న తల్లిదండ్రుల పోషణ, ఆరోగ్య సంరక్షణపై అవగాహన, 29న గ్రామ పంచాయతీ కార్యదర్శులచే తల్లిదండ్రుల పోషణ సంరక్షణపై అవగాహన, 30న అంగన్‌వాడీ పాఠశాలలో పెరేంట్స్ డే నిర్వహణ, అక్టోబర్ 1న అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవంతో ఈ కార్యక్రమం ముగుస్తుందని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో , ఆర్డీవో, డీడబ్ల్యూవో పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

వడ్డేపల్లి, సెప్టెంబర్ 25: ఓ ఇంట్లో అక్రమంగా నిల్వచేసిన రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన మున్సిపాలిటీ కేంద్రంలో చోటు చేసుకున్నది. పోలీసులు కథనం ప్రకారం విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం అర్ధరాత్రి శాంతినగర్ ఎస్సై సంతోష్ తన సిబ్బందితో కోయిలదిన్నె రోడ్డులో ఉన్న భాస్కర్‌కు చెందిన పిండి గిర్నిలో సోదాలు నిర్వహించారు. సుమారు 20 క్వింటాళ్ల రేషన్ బియ్యం, 40 క్వింటాళ్ల నూకలు అక్రమంగా నిల్వ ఉంచడాన్ని గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. భాస్కర్‌పై కేసు నమోదు చేశారు.

దళిత విద్యార్థి సంఘ నాయకుడిపై ఇన్‌చార్జి సీఐ దాడి

• ఎస్పీకి ఫిర్యాదు చేసిన నాయకులు

గద్వాల అర్బన్, సెప్టెంబర్ 25 : దళిత సంఘ విద్యార్థి నాయకుడు మహేశ్‌పై గద్వాల ఇన్‌చార్జి సీఐ మంగళవారం అర్ధరాత్రి అకారణంగా దాడి చేశారని, సీఐపై చర్యలు తీసుకోవాలని దళిత సంఘ నాయకులు ఎస్పీ కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంగళవారం సాయంత్రం ఓ ప్రైవేట్ పాఠశాలలో చదుతున్న బాలుడు అనారోగ్యంతో మృతిచెందిన విషయం విధితమే. బాలుడి మృతికి కారణం పాఠశాల యాజమాన్యమే అంటూ నిరసన వ్యక్తం చేస్తూ ధర్నా చేపట్టారు. ఈ క్రమంలో ఇన్‌చార్జి సీఐ మహేశ్‌పై అసభ్యపదజాలంతో దూషిస్తూ దాడి చేసినట్లు ఆరోపించారు. దాడి చేసిన ఇన్‌చార్జి సీఐపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో దళిత సంఘ నాయకులు రాజు, కొంకల భీమన్న, అశోక్, రాజు, కుర్వ పల్లయ్య, మహేశ్ ఉన్నారు. ఈ విషయంపై ఇన్‌చార్జి సీఐ నాగేశ్వర్ రెడ్డిని వివరణ కోరగా.. ప్రైవేట్ పాఠశాల వద్ద బాలుడి కుటుంబ సభ్యులు బాలుడి మృతికి పాఠశాల యాజమాన్యమే కారణమంటూ పెద్ద సంఖ్యలో ఆందోళన చేసుంటే వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేస్తున్నాం. ఈ క్రమంలో బాలుడి బందువులు, పాఠశాల యాజమాన్యం ఒకరిపై ఒకరు తోసుకుంటున్నారు. వారిని విడిపిస్తూ పక్కకు జరిపాం తప్పా.. ఎవరిపై దాడి చేయలేదు. నా బాధ్యత నేను నిర్వర్తించానని చెప్పారు.

పోక్సో కేసు నమోదు

• ముగ్గురు యువకులు రిమాండ్

కేటీదొడ్డి, సెప్టెంబర్ 25 : ఓ బాలికను లైంగిక వేధింపులకు గురిచేయడంతో బాలిక ఆత్మహత్య చేసుకున్న కేసులో ముగ్గురు నిందితులపై పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ బుధవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం మండలంలోని ఉమిత్యాల గ్రామానికి చెందిన ఓ మైనర్‌ను ఉమిత్యాల, నందిన్నె గ్రామాలకు చెందిన ముగ్గురు యువకులు లైంగికంగా వేధింపులకు పాల్పడటంతో ఈనెల 12వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా చికిత్స పొందుతూ ఈనెల 20వ తేదీన మరణించింది. యువకులు లైంగిక వేధింపులే బాలిక ఆత్మహత్యకు కారణమని యువతి కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు నిందితులపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

సమాజ శాస్త్రవేత్తలు సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు

• ఆంధ్రజ్యోతి ఎడిటర్ శ్రీనివాస్

వనపర్తి టౌన్, సెప్టెంబర్ 25 : సమాజ శాస్త్రవేత్తలు సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులని ఆంధ్రజ్యోతి ఎడిటర్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరమ్ ఆధ్వర్యంలో సమాజంలో వర్తమాన పోకడలు, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల పాత్ర అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. కార్యక్రమానికి ఎడిటర్ శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరైన మాట్లాడారు. సెమినార్‌లో సాంఘిక శాస్త్ర ఫోరం అధ్యక్షుడు భగవంతు, కార్యదర్శి వెంకటేశ్, రాష్ట్ర అధ్యక్షులు రతన్ పాండురంగా, ఎంఈవోలు శ్రీనివాస్‌గౌడ్, జయరాములు, జయ శుకర్, జీహెచ్‌ంఎం ఉమాదేవి, శ్రీనివాస్ గౌడ్, శ్రీరాం, కుర్మయ్య ఉన్నారు.

పాఠశాలల్లో పెండింగ్ పనులను పూర్తి చేయాలి

• కలెక్టర్ సంతోష్

అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

గద్వాల అర్బన్,సెప్టెంబర్ 25 : పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ సంతోష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో కేజీబీవీ ప్రిన్సిపాళ్లు, ఎంఈవోలు, ఇంజినీర్లతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అసిస్టెంట్ ఇంజినీర్ల పనులపై సమగ్ర నివేదికను సిద్ధం చేయాలన్నారు. ప్రస్తుత నిర్మాణ పనులు, మంజూరైన మొత్తం నిధులు, కేజీబీవీలకు సంబంధించిన సమాచారం తదితర విషయాలను నివేదిక రూపంలో అందజేయాలని ఈఈపీఆర్‌లకు ఆదేశించారు. జిల్లాలోని ప్రతి కేజీబీవీలో నీటి సరఫరా, మరుగుదొడ్లు, శాని టేషన్ పనులను పూర్తి చేయాలని ఇంజినీర్లను ఆదేశించారు. ఎవరైనా అనధికారికంగా పాఠశాల ప్రాంగణంలోకి ప్రవేశిస్తే, ప్రిన్సిపాల్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాఠశాలల్లో ఏమైనా సమస్యలుంటే పంచాయతీ కార్యదర్శి లేదా మున్సిపాలిటీ అధికారులకు లేదా ఎంఈవోలకు తెలియజేయాలన్నారు. ముఖ్యంగా నీటి కనెక్షన్లు ,శాని టేషన్ సమస్యల విషయంలో చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంఈవోలు పాఠశాలల సమస్యలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, పంచాయతీరాజ్ శాఖ ఈఈ దామోదర్ రావు పాల్గొన్నారు.

ఎక్సైజ్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న చెలిమిల్ల గీత కార్మికులు

గీత కార్మికుల ఆందోళన

కొత్తకోట,సెప్టెంబర్ 25 : పట్టణంలోని ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం ఎదుట బుధవారం పెబ్బేరు మండలం చెలిమిల్ల గ్రామానికి చెందిన గీత కార్మికులు ఆందోళన చేపట్టారు. గ్రామంలోని 119 మందికి సభ్యత్వం ఉండగా, వారందరూ కలిసి నలుగురి పేరుపై లైసెన్స్ దక్కించుకున్నారు. వారే దుకాణాన్ని నడుపుతూ మిగితా సభ్యులకు షేర్స్ డబ్బులను ఇవ్వకపోవడంతో ఆందోళన చేపట్టారు. కాగా ఎక్సైజ్ శాఖ అధికారి జానకి అందరూ డబ్బులు కడితే లైసెన్స్‌లు అందజేస్తామని చెప్పారు.

ప్రధానోపాధ్యాయులది పెద్దన్న పాత్ర

జేహెచ్ఎంల కార్యవర్గాన్ని సన్మానిస్తున్న సాహితీ కళా వేదిక సభ్యులు

వనపర్తి టౌన్, సెప్టెంబర్ 25 : పాఠశాలల పరిరక్షణలో ప్రధానోపాధ్యాయులది పెద్దన్న వంటి పాత్ర అని సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ అన్నారు. ఇటీవల నూతనంగా ఎన్నికైన గెజిటెడ్ హెడ్ మాస్టర్ల కార్యవర్గాన్ని బుధవారం జిల్లా కేంద్రంలోని బాలభవన్‌లో సాహితీ కళావేదిక సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలుస శంకర్ గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తూ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలకు మార్గదర్శనం చేయడంలో ప్రధానోపాధ్యాయుల సంఘం ప్రధాన భూమిక పోషించాలని కోరారు. వనపర్తి జిల్లా విద్యావ్యవస్థను కాపాడేందుకు తామెప్పుడూ ముందుంటామని జీహెచ్ఎంల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సూర చంద్రశేఖర్, మద్దిలేటి హామీ ఇచ్చారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని కళావేదిక ప్రతినిధులు శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు సూర చంద్రశేఖర్, మద్దిలేటి, శంకరయ్య, గణేశ్‌కుమార్, మంజులత, ఉమాదేవి, సరస్వతి, కుర్మయ్య, కృష్ణానాయక్, ఆనంద్, ఉపాధ్యాయ సంఘాల నేతలు సురభి శ్రీనివాసరావు, హరిప్రసాద్, మహిపాల్‌రెడ్డి, ప్రతాప్ రెడ్డి, అనిల్, రాములుయాదవ్, శ్రీనివాసులు, నిరంజనయ్య, రవిప్రసాద్‌గౌడ్, విష్ణు, సత్తార్ తదితరులు ఉన్నారు.

ఫలితాలు ప్రకటించి ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ నాయకులు

వనపర్తి టౌన్, సెప్టెంబర్ 25 : ప్రభుత్వం డీఎస్సీ ఫలితాలను వెంటనే ప్రకటించి టీచర్ల పోస్టులు భర్తీ చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.డీ కుతుబ్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎత్తం మహేశ్ డిమాండ్ చేశారు. జిల్లాకార్యాలయంలో బుధవారం వారు మాట్లాడుతూ జూన్ 12న పాఠశాలలు పున: ప్రారంభమయ్యాయని, ఉపాధ్యాయులు కొరతతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. 11,062 టీచర్ ఉద్యోగాల భర్తీ కోసం జూలై 18 నుంచి ఆగస్టు 5 వరకు పరీక్షలు నిర్వహించి నేటి వరకు ఫలితాలను ప్రకటించలేదన్నారు. సెప్టెంబర్‌లో ఫలితాలు ప్రకటిస్తామని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారని, సెప్టెంబర్ నెల ముగుస్తున్నా ఫలితాలు విడుదల చేసే పరిస్థితి కనిపించడం లేదన్నారు. ఇతర పోటీ పరీక్షలు ఉన్నందునా డీఎస్సీని కొద్ది రోజులు వాయిదా వేయాలని అభ్యర్థులు వేడుకున్నా స్పందించని సర్కారు ఇప్పుడు ఫలితాలను ఎందుకు ఆలస్యం చేస్తున్నదన్నారు. ఫలితాలను ప్రకటించి ఉద్యోగాలను భర్తీ చేసి నిరుద్యోగుల కలలు నెరవేర్చడం తోపాటు పాఠశాలల్లో టీచర్లు లేక పిల్లలు పడుతున్న ఇబ్బందులను తీర్చాలన్నారు. ప్రభుత్వం డీఎస్సీ ఫలితాలను వెంటనే ప్రటించకుంటే ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామమని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ఇన్‌చార్జి రమేశ్, నాయకులు విష్ణు, చందు తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటకకు మన నీళ్లను తరలిస్తే చూస్తూ ఊరుకోం

• బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కురువ విజయ్‌కుమార్

గద్వాల, సెప్టెంబర్ 25 : గట్టు ఎత్తిపోతల పథకం ద్వారా కర్ణాటకు మన నీళ్లను తరలిస్తే చూస్తూ ఊరుకోమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కురువ విజయ్‌కుమార్ బుధవారం ప్రకటనలో హెచ్చరించారు. గట్టు ఎత్తిపోతల పథకం నుంచి ఎలాంటి శాస్త్రీయ సర్వే లేకుండా ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండా ప్రాజెక్టును ఎలా ప్రతిపాదిస్తారని ఆయన ప్రశ్నించారు. ఇక్కడి నాయకులు జిల్లా మంత్రి కలిసి డబ్బులు దోచుకోవడానికే ఈ ప్రాజెక్టును తెరపైకి తెస్తున్నారని ఆరోపించారు. గట్టు ఎత్తిపోతల పథకం పేరుతో పెద్దఎత్తున డబ్బు దండుకోవడానికి బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన ఘనుడు ప్రత్నిస్తున్నారన్నారు.ప్రాజెక్టులు కట్టాలంటే అక్కడి రైతులు, ప్రజలతో ప్రజాభిప్రాయ సేకరణ చేయాలని సూచించారు. తమ నాయకులను అరెస్ట్ చేసి మంత్రులు జిల్లాలో పర్యటించడం సిగ్గు చేటన్నారు. కాంగ్రెస్ పభుత్వానికి ప్రజాస్వామ్యం మీద గౌరవం లేదన్నారు. పేరుకే ప్రజా పాలన ఆచరణలో నిర్బంధాలతో పరిపాలన చేస్తున్నారని ఆరోపించారు. త్వరలోనే గట్టు ఎత్తిపోతల పథకంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాజీ నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్ రావు, మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డిలతో చర్చించి మా పార్టీ కార్యచరణ ప్రకటిస్తామని చెప్పారు. గట్టు ఎత్తిపోతల పథకం నుంచి కర్ణాటకు నీరు తరలిస్తే నడిగడ్డకు తీవ్ర నష్టం జరుగుతుందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అందుచేత రైతులతో కలిసి ఈ ప్రాజెక్టును అడ్డుకుంటామని చెప్పారు.

కేజీబీవీలో దరఖాస్తుల ఆహ్వానం

వనపర్తి టౌన్, సెప్టెంబర్ 25: జిల్లావ్యాప్తంగా ఉన్న కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర పోస్టులను భర్తీ చేయనున్నట్లు జీసీడీవో శుభలక్ష్మి చెప్పారు. 2023-24 విద్యా సంవత్సరంలో ఖాళీ ఏర్పడిన పోస్టుల్లో రాష్ట్ర సంచాలకులు సమగ్ర శిక్షా హైదరా బాద్ వారి ఆదేశాను సారం సీఆర్టీలు, పీజీసీఆర్టీ, పీఈటీలు మొత్తం 15ఖాళీలు ఉన్నాయని తెలిపారు. వీటిని మెరిట్, రోస్టర్ ప్రాతిపదికన 1:3 ప్రకారం https://deowanaparthy.webly.com జిల్లా వెబ్‌సైట్‌లో మెరిట్ జాబితా ఉందని తెలిపారు. ఉత్తీర్ణత సాధించిన వారికి ఈనెల 27వ తేదీన డీఈవో కార్యాలయంలో ధ్రువీకరణ పత్రా